క్లుప్తంగా

నాడు-నేడు పనులను వేగవంతం చేయాలి



గుడ్లవల్లేరు: నాడు-నేడు కింద ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న పనులను వేగవంతం చేయాలని ఎంఈఓ జి.గోపాలరావు అన్నారు. ఈ విషయమై గుడ్లవల్లేరు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఆయన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. నాడు-నేడుకు కేటాయించిన నిధుల మేరకు పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. సదస్సులో ఎంఈఓ-1 జి.జగన్మోహనరావు పాల్గొన్నారు.

ఘనంగా కళాకారుల సంఘ వార్షికోత్సవం



గుడివాడ టౌన్: పట్టణ కళాకారుల సంఘం మూడో వార్షికోత్సవం ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎన్జీఓస్ హోమ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు కళాకారులను, కళాపోషకులను ఘనంగా సత్కరించారు. అర్బన్ బ్యాంక్ చైర్మన్ పిన్నమనేని పూర్ణ వీరయ్య(బాబ్జి), మున్సిపల్ మాజీ చైర్మన్ శ్రీనివాసరావు, డాక్టర్ బందారు శ్యామ్‌కుమార్, సంఘం గౌరవాధ్యక్షుడు చింతయ్య, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ బలరామ్, డైట్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ ఆంజనేయులు, సంఘం అధ్యక్షుడు కొడాలి రాజా పాల్గొన్నారు. అనంతరం 20 మంది వృద్ధ కళాకారులకు రూ. 1000 చొప్పున సాయం అందజేశారు.

రిజిస్ట్రేషన్ల ప్రక్రియ వేగవంతం



మండవల్లి: మండలంలోని గ్రామాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని ఎంపీడీఓ ఆర్ బేబీ శ్రీలక్ష్మి,, ఈఓపీఆర్డీ ఆనందబాబు పేర్కొన్నారు. మండలంలోని భైరవపట్నం గ్రామ సచివాలయంలో రిజిస్ట్రేషన్ కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల వారందరికీ ఎలాటి ఆర్థిక సమస్యలు లేకుండా సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్లు జరిగేవిధంగా చర్యలు చేపట్టిందన్నారు. కార్యదర్శి ప్రభాకరరావు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో పింఛన్ పంపిణీ

గుడివాడ టౌన్: ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళకు సోమవారం పింఛన్ అందజేశారు. స్థానిక 5వ వార్డుకు చెందిన నరహరశెట్టి బేబీ సరోజిని అనారోగ్యంతో బాధపడుతూ గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వలంటీరు ఎం. వీరవనిత ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేశారు.

ఎస్టీయూ మండల కమిటీ అధ్యక్షుడిగా ఫికోల్



పమిడిముక్కల: ఎస్టీయూ మండల కౌన్సిల్ సమావేశం సోమవారం స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జరిగింది. అధ్యక్షుడిగా ఎం.ఫికోల్, ప్రధాన కార్యదర్శిగా ఎం.ముతార్ అలీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఇమ్మానుయేల్, డి.కోటయ్య, ఎం.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎస్ఐగా రాజు బాధ్యతల స్వీకరణ



పెదపారుపూడి: పెదపారుపూడి స్టేషన్ ఎస్ఐగా జి.రాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఉంగుటూరు మండలం నుంచి ఎన్నికల బదిలీలో భాగంగా ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులోఉండి మెరుగైన సేవలు అందిస్తామన్నారు. మండలంలోని కోడిపందేలు, పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆటో, బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలు

కృత్తివెన్ను: ఆటో బైక్ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరు గాయాలపాలైన సంఘటన సోమవారం ఉదయం కృత్తివెన్ను ప్రధాన సెంటరులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కృత్తివెన్ను ప్రధాన సెంటరు నుంచి గరిశపూడి వైపు వెళుతున్న ఆటో లక్ష్మీపురం వైపునుంచి వస్తున్న బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ద్విచక్ర వాహనదారునితో పాటు ఆటో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. వీరిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మహిళాభ్యున్నతే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం

ఎమ్మెల్యే కొడాలి నాని



సభలో మాట్లాడుతున్న గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడ టౌన్(నందివాడ): మహిళల ఆర్థికాభ్యున్నతే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అన్నారు. నందివాడ మండలం నందివాడ జెడ్పీ హైస్కూల్లో ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. తొలుత మహిళలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం మహిళా ప్రజాప్రతినిధులు ఆసరా మొత్తం చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారులు జగనన్న సంక్షేమ కార్యక్రమాలపై చేసిన నృత్యం ఆకట్టుకుంది. సభలో ఎమ్మెల్యే కొడాలి నాని మాట్లాడుతూ జగన్ మోహన్‌రెడ్డికి పాదయాత్రలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేసిన మోసాన్ని డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు వివరించారన్నారు. దీనిపై స్పందించిన జగన్‌మోహన్‌రెడ్డి తాను అధికారంలోకి రాగానే నవరత్నాల్లో భాగంగా అంచలంచెలుగా వైఎస్సార్ ఆసరా పేరున రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చారన్నారు. ఆ హామీని నిలుపుకుంటూ ప్రతి డ్వాక్రా గ్రూపునకు చెందిన అక్కచెల్లెమ్మలకు పూర్తిగా రుణమాఫీ చేయడం మొదలు పెట్టారన్నారు. ఇందులో భాగంగా నాల్గో విడత పూర్తి రుణమాఫీకి కోట్ల రూపాయలకు సంబంధించి బటన్ నొక్కి తమ ఖాతాలో జమచేశారన్నారు. నందివాడ మండలానికి సంబంధించి 790 గ్రూపులకు చెందిన 7,853 మంది అక్కచెల్లెమ్మలకు రూ. 27.14 కోట్లు రుణమాఫీ చేస్తూ చివరి విడతగా రూ. 6.78 కోట్లు మహిళల ఖాతాల్లో జమచేసినట్లు తెలిపారు. ఇచ్చిన అన్ని హామీలు నెరవేర్చిన జగన్ మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిగా ఎన్నుకోవలసిన బాధ్యత మనపై ఉందన్నారు. ఆర్థికంగా ఎదుగుదల సాధించిన ప్రతి మహిళ జగన్ మోహన్‌రెడ్డికి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ పెయ్యల ఆదాం, జెడ్పీటీసీ సభ్యురాలు కందుల దుర్గాకుమారి, వైస్ ఎంపీపీలు పూడి సుధాకరరావు, జయరాజు, సర్పంచ్ సరెళ్ల రత్నకుమారి, ఎంపీడీఓ వీఎస్ నాగేశ్వరరావు, ఈఓపీఆర్డీ జి.శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, కొండపల్లి కుమార్‌రెడ్డి, దేశిరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, మలిరెడ్డి కృష్ణారెడ్డి, తోట నాగరాజు, మట్టా జాన్‌విక్టర్ పాల్గొన్నారు.

భూమిపై రైతులకు దక్కిన హక్కులు

ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



గోపాలకృష్ణాపురంలో లబ్ధిదారుడికి పట్టా అందజేస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

పమిడిముక్కల: గోపాలకృష్ణాపురం వాసుల 60 ఏళ్ల కల నెరవేరిందని, 24 మంది ఎస్సీ రైతులకు భుమిపై హక్కులు దక్కాయని ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. చోరగుడి శివారు గోపాలకృష్ణాపురంలో ఎంపీటీసీ సభ్యుడు మర్రి దుర్గారావు ఆధ్వర్యంలో జరిగిన రైతులకు పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. 83 కుటుంబాలకు చెందిన 25 మంది రైతులకు పట్టాలు పంపిణీ చేశారు. శ్రీ చలవ గంగానమ్మ తల్లి విగ్రహ స్థాపన కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు మర్రి దుర్గారావు, శ్రీలక్ష్మి దంపతులు పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే అనిల్‌కుమార్ మాట్లాడుతూ ఇది పేదల ప్రభుత్వమని, బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారని తెలిపారు. పట్టాలు పొందిన రైతులంతా భూమిని సాగుచేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. పిల్లలను బాగా చదివించుకోవాలని సూచించారు. గ్రామంలో గడప గడపకు నిధులతో నిర్మించిన సిమెంట రోడ్లను ప్రారంభించారు. దాత చెన్నకేశవుల మల్లేశ్వరరావు గ్రామంలోని 300 మంది ఆడపడుచులకు చీరలు పంపిణీ చేశారు. పట్టాల పంపిణీకి కృషిచేసిన ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, ఎంపీటీసీ దుర్గారావును గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. పేదలకు హక్కులు దక్కేందుకు ప్రత్యేక జీఓ జారీ చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీటీ యేసుపాదం, ఎంపీడీఓ కొండేటి వెంకటేశ్వరావు, వైస్ ఎంపీపీలు గంజాల సీతారామయ్య, కొడమంచిలి మహేష్, పీఏసీఎస్ అధ్యక్షులు మర్రి మల్లికార్జునరావు, నాయకులు అమ్మిరెడ్డి శివరామకృష్ణ, మర్రి బాబూరావు, బాసు రమేష్, కనుమూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సులువుగా రెవెన్యూ సేవలు



పెదపారుపూడి తహసీల్దార్‌గా వెంకటమాధవరావు



గుడివాడ తహసీల్దార్‌గా రామాంజనేయులు



పామర్రు తహసీల్దార్‌గా శ్రీ పల్లవి

గుడివాడరూరల్: ప్రజలకు రెవెన్యూపరమైన సేవలను సులువుగా అందించేందుకు చర్యలు తీసుకుంటానని నూతన తహసీల్దార్ ఏవీ రామాంజనేయులు పేర్కొన్నారు. గుడివాడ తహసీల్దార్‌గా పని చేస్తున్న కె.ఆంజనేయులు రాజమహేంద్రవరం రూరల్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో అత్తిలి నుంచి ఏవీ రామాంజనేయులు బదిలీపై గుడివాడకు వచ్చారు. సోమవారం నూతన తహసీల్దార్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ తమ కార్యాలయానికి వచ్చే ప్రజలకు త్వరితగతిన సేవలు అందించేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కిషోర్, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ లోవరాజు, ఆర్ఐ నాగబాబు పాల్గొన్నారు.



గుడ్లవల్లేరు తహసీల్దార్ శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీటీ కనకదుర్గ

తహసీల్దార్‌గా శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు నూతన తహసీల్దార్‌గా వై.శ్రీనివాస్ సోమవారం బాధ్యతలను స్వీకరించారు. గుడ్లవల్లేరులో పని చేసిన అబ్దుల్ రెహ్మాన్ సుల్తానా బదిలీపై తూర్పు గోదావరి జిల్లా సీతానగరం వెళ్లారు. విధుల్లో చేరిన శ్రీనివాస్‌ను డీటీ బి.కనకదుర్గ, ఆర్ఐ షకీలా బేగం, వీఆర్వోలు, సిబ్బంది పుష్పగుచ్ఛాలను అందించి అభినందించారు.

పామర్రు తహసీల్దార్‌గా శ్రీ పల్లవి

పామర్రు: పామర్రు మండల తహసీల్దార్‌గా పరమట శ్రీ పల్లవి సోమవారం బాధ్యతలను స్వీకరించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ పామర్రుకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండల ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని తెలిపారు. తొలత డీటీ నాగ మల్లేశ్వరరావు, ఎన్నికల డీటీ జగన్‌మోహన్‌రావు, కార్యాలయ సిబ్బంది ఆమెకు స్వాగతం పలికారు.

పెదపారుపూడి తహసీల్దార్‌గా వెంకటమాధవరావు

పెదపారుపూడి: మండల తహసీల్దార్‌గా వెంకట మాధవరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. క్లిరంపూడి మండలం నుంచి బదిలీపై ఇక్కడుకు వచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ పజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందిస్తామన్నారు.



మొవ్వ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపడుతున్న వెంకటలక్ష్మి

మొవ్వ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన వెంకటలక్ష్మి

మొవ్వ: మొవ్వ నూతన తహసీల్దార్‌గా సీహెచ్ వెంకటలక్ష్మి సోమవారం బాధ్యతలు చేపట్టారు. డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ గోపాలరావు నుంచి బాధ్యతలు తీసుకున్నారు. కాకినాడ రెవెన్యూ డివిజన్ ఆఫీసులో పరిపాలన అధికారిగా(ఏఓ) కొనసాగిన ఆమె ఎన్నికల బదిలీల్లో భాగంగా మొవ్వ మండలానికి వచ్చారు. ఈమెకు ఆర్ఐ ఈడే విజయలక్ష్మి, జూనియర్ అసిస్టెంట్ శామ్యూల్ అభినందనలు తెలిపారు.

జూదరులపై కేసు నమోదు

మండవల్లి: పెరికెగూడెంలో పేకాట శిబిరంపై దాడి చేసి తొమ్మిది మంది జూదరులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై సీహెచ్ఎస్ రామచంద్రరావు తెలిపారు. జూదరుల నుంచి రూ.9,550 స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి నోటీసులు ఇచ్చి, సొంత పూచీకత్తులపై పంపించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కానుకల ద్వారా రూ.9.10 లక్షల ఆదాయం

పమిడిముక్కల: మంటాడ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం హుండీలను తెరచి భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారని ఆలయ ఈఓ మాధవీలత తెలిపారు. 151 రోజులకు గాను రూ.9,10,940ల ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు.

ఈకేవైసీ పూర్తిచేయాలి

మండవల్లి: ఈ-క్రాప్ రైతుల ఈకేవైసీ త్వరితగతిన పూర్తి చేయాలని సహాయ వ్యవసాయ సంచాలకులు జి.వెంకటమణి పేర్కొన్నారు. స్థానిక మండల వ్యవసాయ కార్యాలయంలో వీఏఏల సమావేశం సోమవారం జరిగింది. ఏడీఏ మాట్లాడుతూ చిరుధాన్యాల మీద ప్రచురించిన పుస్తకాలను ఆర్బీకేలలో ఉంచవలసినదిగా వీఏఏలకు తెలియజేశారు. చిరుధాన్యాల ప్రాముఖ్యతను రైతులకు తెలియజేయాలని కోరారు. మండల వ్యవసాయాధికారి షేక్ జరీనా పాల్గొన్నారు.

రహదారికి మరమ్మతులు

మండవల్లి: మండవల్లి రైల్వే గేట్ వద్ద పంచాయతీ ఆధ్వర్యంలో రహదారికి మరమ్మతులు చేపట్టారు. చేపల చెరువుల లోడ్ వాహనాలు, మేత వాహనాలు ఈ రహదారి నుంచి మూడుతాళ్లపాడు తదితర గ్రామాలకు వెళుతుంటాయి. దీంతో ఈ రహదారి పూర్తిగా గుంతలు పడి చిన్నపాటి వర్షం కురిసినా నీరు నిలచి వాహనదారులు పాదాచారులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పంచాయతీ ఆధ్వర్యంలో సోమవారం జేసీబీతో రహదారిని బాగుచేశారు. పంచాయతీ సభ్యుడు నాంచారయ్య పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో స్థలాల రిజిస్ట్రేషన్ల పరిశీలన



గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు జగనన్న కాలనీలోని ప్రభుత్వ నివేశ స్థలాల లబ్ధిదారులకు చేస్తున్న రిజిస్ట్రేషన్లను నూతన తహసీల్దార్ వై.శ్రీనివాస్ పరిశీలించారు. సోమవారం గుడ్లవల్లేరు గ్రామ సచివాలయంలో వందలాది మంది లబ్ధిదారులకు వారి ప్లాట్ నంబర్లను రిజిస్ట్రేషన్ చేసే ప్రక్రియను తహసీల్దార్‌తో పాటు డీటీ బి.కనకదుర్గ పరిశీలించారు. గ్రామ కార్యదర్శి ఎ.జె.ఎల్.నరసింహారావు, వీఆర్వో గంగాధరరావు, డిజిటల్ అసిస్టెంట్ సుస్మిత పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కొడాలి నానీని కలిసిన కమిషనర్



ఎమ్మెల్యే నానీని కలిసిన మున్సిపల్ కమిషనర్

గుడివాడ టౌన్: గుడివాడ మున్సిపల్ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన జి.బాలసుబ్రహ్మణ్యం రాజేంద్రనగర్ లోని ఎమ్మెల్యే స్వగృహంలో ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని)ని సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కమిషనర్‌తో మాట్లాడుతూ పట్టణ అభివృద్ధి, ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందించడంలో ఆలస్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రభుత్వ సేవలు ప్రజలకు చేరువ చేయాలనదే లక్ష్యం



రైతుభరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడ టౌన్(నందివాడ): ప్రభుత్వ సేవలు ప్రజలకు చేరువ చేయాలనేదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పం అని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అన్నారు. నందివాడ మండలం ఇలపర్రు శివారు లక్ష్మీనరసింహపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రం, సచివాలయాల భవనాలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ సేవలు ప్రజలకు అత్యంత దగ్గరకు చేర్చాలని సచివాలయ వ్యవస్థను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో ఇలపర్రు సర్పంచ్ నత్తా మరియమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు రోమేశ్వరరావు, నాగూర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ద్వారకా తిరుమల దేవస్థానానికి గార్బేజ్ ట్రక్ అందజేత



గార్బేజ్ ట్రక్కును అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

గుడివాడ టౌన్: ద్వారకా తిరుమల దేవస్థానానికి నుగలాపు జయలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ అధినేత, మాజీ మున్సిపల్ చైర్మన్ నుగలాపు వెంకటేశ్వరరావు గార్బేజ్ ట్రక్కును అందజేయడం గొప్ప విషయమని పీఏసీఎస్ బ్యాంక్ అధ్యక్షుడు మూల్పూరి ప్రభుకాంత్ అన్నారు. సోమవారం స్థానిక ఆటోనగర్‌లోని శ్రీ శ్రీనివాస ఆటో ఇంజనీరింగ్ వర్క్స్‌లో నుగలాపు చారిటబుల్ ట్రస్ట్‌చే దేవస్థానానికి గార్బేజ్ ట్రక్కును అందజేశారు. ఈ సందర్భంగా మూల్పూరి ప్రభుకాంత్ మాట్లాడుతూ 2010 నుండి ద్వారకా తిరుమల దేవస్థానానికి ప్రతి ఏడాదీ భక్తులకు, ప్రజలకు ఉపయోగపడే 3 గార్బేజ్ ట్రక్కులు, 2 వాటర్ ట్రక్కులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. నుగలాపు కుటుంబ సభ్యులు వెంకట సురేష్‌బాబు, ఇతర సభ్యులు చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో రాధారంగా మిత్రమండలి అధ్యక్షుడు గిరిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు బి.సూర్యనారాయణ, అల్లాడి గోవింద్, దేవస్థానం సభ్యుడు కుమార్ పాల్గొన్నారు.

మినుము పంట సస్యరక్షణ చర్యలపై సూచనలు



పెరికెగూడెంలో రైతులకు సూచనలు ఇస్తున్న ఏడీఏ వెంకటమణి, ఏఓ జరీనా

మండవల్లి: మండలంలోని పెరికెగూడెం, కానుకొల్లు గ్రామాల్లో మండల సహాయ వ్యవసాయ సంచాలకులు జి వెంకటమణి, మండల వ్యవసాయాధికారి ఎస్‌కే జరీనాతో కలిసి మినుము పంట పొలాలను పరిశీలించి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు సూచనలు, సలహాలు అందజేశారు. తొలుత మినుము వేసిన పొలాలలను ఈ-క్రాప్‌లో నమోదైనట్లు సూపర్‌చెక్ రికార్డులను పరిశీలించారు. రసం పీల్చే పురుగు సస్యరక్షణ చర్యల గూర్చి వివరించారు. దీని నివారణకు రోగార్ (డైమిథోయేట్) 2.5 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. మినుములో పూత పురుగు నివారణకు నోవాల్యురాన్ పిచికారీ చేయాలన్నారు. వేపనూనె కూడా పిచికారీ చేయాలని సూచించారు.

గ్రామాల్లో రహదారుల నిర్మాణానికి చర్యలు

ఎంపీపీ గద్దే పుష్పరాణి



గణేష్‌నగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ పుష్పరాణి

గుడివాడరూరల్: మండలంలోని గ్రామాల్లో రహదారుల నిర్మాణానికి గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) చొరవతో ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని ఎంపీపీ గద్దే పుష్పరాణి పేర్కొన్నారు. మండలంలోని వలివర్తిపాడు పంచాయతీ పరిధిలోని గణేష్ నగర్‌లో రూ.10 లక్షల వ్యయంతో 127 మీటర్ల నూతన సిమెంట్ రోడ్ నిర్మాణానికి వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్‌తో కలసి ఎంపీపీ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గణేష్‌నగర్‌లో రోడ్ శిథిలావస్థకు చేరిందని స్థానికులు వైఎస్సార్ సీపీ నాయకుడు దుక్కిపాటి శశిభూషణ్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన ఎమ్మెల్యే కొడాలి నానికి సమస్యను వివరించగా రహదారి నిర్మాణానికి రూ.10లక్షలు మంజూరు చేసేందుకు ఎమ్మెల్యే కృషి చేశారన్నారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ వి.సూరిబాబు, కాంట్రాక్టర్ కె.కిరణ్‌కుమార్, సిద్ధి వినాయక దేవస్థానం కమిటీ సభ్యుడు డి.సాయికోటేశ్వరరావు పాల్గొన్నారు.

రూ.10 లక్షలతో బిళ్లపాడులో సీసీ రోడ్డు నిర్మాణం




బిళ్లపాడులో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్, ఎంపీపీ

గుడివాడరూరల్: బిళ్లపాడు గ్రామంలోకి వెళ్లే ప్రధాన రహదారి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు వైఎస్సార్ సీపీ నాయకుడు దుక్కిపాటి శశిభూషణ్ దృష్టికి తీసుకురాగా స్పందించిన ఆయన వెంటనే గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని)కు రహదారి సమస్యను వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే రూ.10లక్షలు మంజూరు చేయించారు. సోమవారం గుడివాడ మార్కెట్‌యార్డ్ చైర్‌పర్సన్ మట్టా నాగమణి, ఎంపీపీ గద్దే పుష్పరాణి బిళ్లపాడులో నిర్మించనున్న సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేసి నిర్మాణపనులను ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్, మార్కెట్‌యార్డ్ డైరెక్టర్ చుక్కా నాగలక్ష్మి, మండల సచివాలయ కన్వీనర్ కారే జోసఫ్, పంచాయతీరాజ్ ఏఈ సూరిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు గద్దే రాము, జోగి సోములు, పంచాయతీ కార్యదర్శి హరికృష్ణ పాల్గొన్నారు.

కరాటేలో శరవణ్‌రాజ్‌కు ప్రథమ బహుమతి

బంటుమిల్లి: మండలంలోని ఆముదాలపల్లి పంచాయతీ శివారు జయపురం గ్రామానికి చెందిన బి.శరవణ్‌రాజ్ కరాటే కుమితే, కటా విభాగాల్లో ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించాడు. ఈ నెల 4న బాపట్లలో ఇంటర్ స్టేట్ ఇన్విటేషనల్ కరాటే చాంపియనషిప్-2024 రాష్ట్ర స్థాయిలో నిర్వహించారు. ఈ పోటీల్లో శరవణ్‌రాజ్ 11 సంవత్సరాల విభాగంలో కుమితే పోటీలో ప్రథమ స్థానం, కటా విభాగంలో ద్వితీయ స్థానం దక్కించుకున్నాడు.

'స్పందన'కు ఐదు దరఖాస్తులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్

గుడివాడ టౌన్: ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి సత్వర పరిష్కారానికి స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ జి.బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ సమస్యలపై ఐదు దరఖాస్తులు వచ్చాయని వాటిని సత్వరమే పరిష్కరించేలా అధికారులకు సూచించామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ డీటీపీ కృష్ణారావు, అధికారులు పాల్గొన్నారు.

అన్నవరపు వారి ఆత్మీయ సమ్మేళనం



అన్నవరపు వారి ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న కుటుంబ సభ్యులు

పామర్రు: గ్రామంలోని అన్నవరపు చిన్న గిరిరాజు భాగ్యమ్మల కుటుంబ సభ్యుల అన్నవరపు వారి ఆత్మీయ సమ్మేళనం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్న గిరిరాజు భాగ్యమ్మ, అన్నవరపు వెంకటేశ్వరరావు, అన్నవరపు నాగలింగంలు సహస్ర చంద్రోదయాలు దర్శించిన సందర్భంగా వారికి ఘనంగా సత్కరించారు. అనంతరం కుటుంబ సభ్యులు అందరూ కలిసి ఎంతో ఉత్సాహం గడిపారు.

మాలమహానాడు జిల్లా అధ్యక్షుడిగా పద్మారావు

కలిదిండి: మాలమహానాడు ఏలూరు జిల్లా అధ్యక్షుడిగా వెంకటాపురం గ్రామానికి చెందిన ఈదా పద్మారావు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు జాకట విజయశేఖర్ ఆయనకు నియామకపత్రాన్ని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా పద్మారావు మాట్లాడుతూ మాలల హక్కుల కోసం, షెడ్యూల్ కులాల ఐక్యత హక్కుల కోసం పోరాడతానని తెలిపారు.

మండలాభివృద్ధికి సమన్వయంతో పనిచేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రామిశెట్టి

ముదినేపల్లి రూరల్: స్థానిక ప్రజాప్రతినిధులు అధికారుల సమన్వయంతో మండల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. ముదినేపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన సమావేశపు హాలులో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో నెలకొన్న పలురకాల సమస్యలను ఇప్పటికే దశలవారీగా పరిష్కరించినట్లు చెప్పారు. బదిలీపై వెళ్తున్న ఎంపీడీవో పీ మల్లీశ్వరీ మండలాభివృద్ధికి విశేష సేవలందించినట్లు తెలిపారు. నూతన ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన గంగాధరరావు ఇదే విధమైన సేవలందించాలని కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశ్వరమ్మ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపీపీలు చొప్పర్ల సునీత, రాచూరి రాధా, మండల కోఆప్షన్ మెంబర్ షేక్ అల్లాభక్షు పాల్గొన్నారు.